ఓంశ్రీసాయిరాం

సర్వాధీనం యిదం జగత్ సర్వం సత్యాధీనం
తత్ సత్యం ఉత్తమాధీనం ఉత్తమో పరమం పవిత్రం

ఈ జగత్తంతయూ దైవము చేతిలో, దైవమునందు అధీనమై ఉంటున్నది. దైవము సత్యముయొక్క అధీనమై ఉంటున్నది. సత్యము ఉత్తమునియొక్క అధీనమై ఉంటున్నది.

విద్యర్థులారా! ఈనాడు మీరందరూ ఎలా ప్రపంచమునకు శాంతి సందేశములనందించే దూతలుగా తయారుకావాలి? ఇట్టి దూతలుగా తయారగుటకు త్యాగము అత్యలసరము. త్యాగముపై రక్తి, భోగముపై విరక్తి ఉండిన వ్యక్తులే త్యాగశీలురు కాగలరు. ఇట్టి రక్తికి, విరక్తికి ఉండిన వ్యత్యాసము గుర్తించి వర్తించినప్పుడే త్యాగజీవులు దివ్యమైన ఆనందమునందుకొనగలరు. భూమి సరవంతమైనప్పటికీ విత్తనము బలహీనమైనప్పుడు వృక్షము అభివృద్ధి కాదు. లేక, విత్తనము పుష్టికరమైనప్పటికీ భూమి సారహీనమైనప్పుడు ఈ విత్తనము పెద్ద వృక్షముగా మారలేదు. విద్యార్థియైన ప్రతి వ్యక్తి సంస్కారవంతుడుగా మారవలెనంటే దీనికి పూర్వము తల్లిదండ్రులుకూడా సరైన సంస్కారవంతులుగా ఉటుండాలి. చక్కని సంస్కారముతో, చక్కని సదభ్యాసములతో, చక్కని సదాచారములతో జీవించినప్పుడే బిడ్డలుకూడా అట్టి అభివృద్ధిని, అట్టి సంస్కారమును, అట్టి సదాచారములు కూడా అందుకోగలరు.

సుసీలానయ్యర్ చెప్పినట్లుగా simple living and high thinking జీవితము ఒక సాధారణ జీవితముగా మనం జీవించాలి. మన ఆదర్శము అత్యంత ఉన్నతమైనదిగా ఉండాలి. దీనికి చక్కని ఆదర్శములు అనేకములుంటున్నవి. గాంధీ తల్లి పుతలీబాయి. ఆమె నిరంతరమూ సత్యమునే పలకాలని, ధర్మమునే ఆచరించాలని, ఈ రెండింటిపై సంపూర్ణ విశ్వాసము కల్గినది. ఆమె జీవితములో ఒక నిర్ణయము తీసుకొని ఆ నిర్ణమయు ప్రకారమే జీవితమును గడుపుతూ వచ్చింది. కోకిల కూత కూసిన తర్వాతనే తాను భుజించేది. ఇది పెద్ద నిర్ణయం. కాని, ఒకనాడు కోకిల సకాలములో కూయలేదు. తల్లి భుజించలేదు. ఈ పరిస్థితి గుర్తించిన గాంధీ యింటి వెనుకకు వెళ్ళి కోయిల వలె కూసి, 'అమ్మా! కోయిల కూసింది. నీవు భుజించవచ్చును' అన్నాడు. గాంధీ చేసిన ఈ ట్రిక్కును గుర్తించిన పుతలీబాయి చాలా బాధపడింది. ఏ పాప ఫలము చేతనో నాకు యిలాంటి కుమారుడు పుట్టాడు. ఇది నా పాప ఫలమేగాని నిన్ను నిందించి ప్రయోజనము లేదు. పవిత్రమైన గర్భమందు అసత్యములాడే కుమారుడు జన్మించటమా! దానితో భరించలేని కోపముతో రెండు కొట్టి లోపలకు వెళ్లిపోయింది. ఆనాడు గాంధీ తనలో తాను ఒక ప్రతిజ్ఞ పట్టాడు. ఇంక నా జీవితములో నేను అసత్యమాడకూడదు. తల్లిని బాధ పెట్టినటువంటి జీవితము ఒక జీవితమా! మన భారతీయ సంస్కృతి మాతృదేవోభవ, పితృదేవోభవ వీరిద్దరే ప్రత్యక్ష దైవములని భావించిన భారతదేశమునందు యీ మాతృగర్భమునందు జన్మించి అసత్యమాడి నా తల్లిని బాధపెట్టాను. నేటినుండి అసత్యమాడటం యేమాత్రం మంచిదికాదని నిర్ణయం చేసుకొని సత్యమునే సాధిస్తూ వచ్చాడు. ఆనాటి తల్లులు పవిత్రమైన చిత్తము కల్గిన ఉత్తమ తల్లులు. తల్లులు అనుభవించి పిల్లలకు ఆదర్శముగా నిరూపించేవారు. అట్టి తల్లుల గర్భమునందే అలాంటి మహనీయులు జన్మిస్తూ వచ్చారు. ఆదిశంకరులు తల్లియైన జగదాంబ చాలా దివ్యమైన ప్రేమ కల్గినది. కనుకనే, శంకరులవారు ఆదర్శవంతమైన జీవితము గడిపి జగత్కీర్తి పొందాడు. శివాజీ కూడా యీవిధముగానే తల్లి బోధించిన సుబోధలను శిరసావహించి పవిత్రమైన కీర్తి అందించాడు. ఈవిధమైన తల్లుల ఆదర్శమును పుత్రులనుభవించి జగత్ వ్యాప్తి గావించి జీవితము సార్ధకముగావించుకున్న జీవులు. భూమిలో దోషము లేదు. వేపవిత్తనము నాటినప్పుడు వేపవృక్షమే వస్తుంది. తీయని మామిడి విత్తనము నాటినప్పుడు తీయని మామిడిపండ్లే ఉద్భవిస్తాయి. భూమి ఒక్కటేగాని విత్తనములు వేరువేరు. అదేవిధముగా మాతృగర్భమునందు అనేకమంది జన్మిస్తూ ఒకరు ఉత్తములు, ఒకరు అధములుగా నిరూపిస్తూ ఉంటారు. జన్మాంతర కర్మల ఫలితమే ఈ మంచిచెడ్డలకు మూలకారణము. ఒకానొక సమయంలో చైతన్యుడు పూరీ వెళ్లాడు జగన్నాధుని దర్శనమునకై. ప్రార్థిస్తున్నాడు, 'జగన్నాధా! లోకనాధా! ప్రాణనాధా! దేహనాధా! నాకు భక్తిప్రపత్తులక్కరలేదు. జపధ్యానములు నా చేత కావు. భోగభాగ్యములు నాకు అక్కరలేదు. నాకు ఒక్కటి మాత్రమే కావాలి. నిన్ను మనసారా ప్రేమించే ప్రేమను నాకనుగ్రహించు. ఆ ఒక్క ప్రేమ ఉండెనా సర్వమూ నేను సాధించగలను. నీ ప్రేమ లేని ఈ జీవితములో ఎన్ని భోగభాగ్యములుండి ఏమి ప్రయోజనము? ఎన్ని శక్తిసామర్థ్యములుండి ఏమి ప్రయోజనము? ఎంత విద్యాకుశలతలుండి ప్రయోజనమేమిటి? ఎంత మేధాశక్తి ఉండి ప్రయోజనమేమిటి? భగవత్ప్రేమకు పాత్రుడు కావాలి. ఆ ఒక్క ప్రేమను అందించ' మన్నాడు. అదేవిధముగనే లోకములో అనేకమంది మహనీయులు నిజమైన తల్లులయొక్క ప్రోద్బలముచేత, ఉత్సాహప్రోత్సాహములచేత అభివృద్ధియై గొప్ప కీర్తిని సాధిస్తూ వచ్చారు. కానీ, దురదృష్టవశాత్తు కాల మార్పుచేత ఈనాడు అట్టి తల్లిదండ్రులు దుర్లభముగా ఉంటున్నారు. అలాంటి తల్లిదండ్రులకు అలాంటి పుత్రులే జన్మిస్తున్నారు. యద్భావం తద్భవతి. ఎట్టి విత్తనమో అట్టి మొక్క, ఎట్టి పిండో అట్టి రొట్టె, ఎట్టి తిండో అట్టి త్రేపు. ఈనాడు విద్యావంతులు, విద్యార్థులు సరైన ఆదర్శప్రాయులు కాకుండాపోవటానికి కారణము తల్లిదండ్రులే. పూర్వము కలకత్తాకు సమీపములో ఒక కుగ్రామంలో ఒక తల్లి, ఒక బిడ్డ జీవిస్తుండేవారు. తల్లి నిత్యము సాయంకాలము కుమారుని దగ్గర చేర్చుకొని, 'నాయనా! నీవు చచ్చే చదువు కాదు చదవ వలసింది, చావులేని చదువు చదువు. ఈ ప్రపంచములో సమస్త చదువులూ కట్టకడపటికి మరణించేటువంటివే.

ఇవన్నీ చావు చదువులు. చావు లేని చదువు ఒక్క దైవముయొక్క జ్ఞానమే. అట్టి చావుపుట్టుకలు లేని చదువు నీవు చదవాలి. ఐతే లోకము ఉన్నది కనుక, ఈ లోకనిమిత్తమై, నిత్యజీవిత నిమిత్తమై కొంత పోషణ కావాలి. జీవిత పోషణార్థమై ప్రాకృత విద్యలు అవసరమే. చదువు. కాని, ఆ చదువును సమాజములో అనుకూలమైన రీతిలో వినియోగించాలి. లోక కల్యాణమునకు నీ చదువు పాటుపడాలి. ఇట్టి సమాజము యొక్క అభివృద్ధికిగాని, లోకకల్యాణమునకుగాని ఏమాత్రమూ ఉపయోగము లేని చదువు చదివితే నేను యేమాత్రమూ అంగీకరించను. సాటి మానవులలో కీర్తిని సాధించి మేటి మానవుడుగా నీవు జీవించాలి. ఆ మేటి మానవుడుగా జీవించే నిమిత్తమై ఈనాడు నీవు చదవు చదవాలి' అని చెప్పింది. కానీ, తల్లి చాలా బీదస్థితిలో ఉంటున్నది. కుమారుని చదివించే స్థితికూడా లేదు. తల్లి అభీష్టము నెరవేర్చే నిమిత్తమై ఈ పిల్లవాడు బజార్లలలో వీధి దీపములక్రింద కూర్చొని చదివి క్రమక్రమముగా ఒక డిగ్రీ తీసుకున్నాడు. ఆ సమయంలో తన గ్రామములో ఒక తిరనాల ప్రారంభమైంది. ఆ తిరనాల నిమిత్తమై శ్రీమంతులంతా విలువైన వస్త్రములు ధరించి ఒకరివెంట ఒకరు పరుగెత్తుతున్నారు. తన తల్లి తిరనాల వైభవము గుర్తించాలని ప్రయాణమైంది. ఈ కుమారుడు చూచాడు. విలువైన దుస్తులు ధరించి అనేకమంది శ్రీమంతులు పోతుంటే ఆ తల్లి పాత వస్త్రము, చిరిగిన వస్త్రము ధరించి తిరనాల చూడటానికి పోతున్నాదని తనలో తాను గుర్తించాడు. కంటిధారలు కార్చాడు. తల్లియొక్క దురవస్థను నేను చూడవలసివచ్చిందికదా అని చింతించాడు. తల్లి వెనుకకు వచ్చిన తర్వాత తల్లి దగ్గర నుంచొని కుమారుడు ప్రార్థిస్తున్నాడు. 'అమ్మా! నీవు ఈ పరిస్థితిలో ఉండటం నేను చూడలేకపోతున్నాను. మన స్థాయికి తగిన దుస్థులు లేకుండాపోతున్నాయి. ఎట్లాగైనా నీ ఆజ్ఞ అయితే ఒక ఉద్యోగమునకు ప్రయత్నిస్తాను' అన్నాడు. 'నాయనా! నా నిమిత్తమై నీవు ఉద్యోగము చేయనక్కర లేదు. నీ జీవిత పోషణార్థమై, సమాజ అభివృద్ధి నిమిత్తమై నీవు ఉద్యోగమునకు ప్రయత్నించు' అని చెప్పింది. ఒక చిన్న ఉద్యోగములో చేరాడు. ఈవిధంగా ఉద్యోగము చేస్తూ పై చదువులు చదువుతూ వచ్చాడు. ఒకనాడు తల్లి దగ్గరకు వచ్చి, 'అమ్మా! కొంతవరకు సంపాయించాను. నా చేతిలో కొంత ధనముంది. నీకేదైనా కోరిక ఉందా? ఏమి కావాలి' అని అడిగాడు. 'నాయనా! నాకేమీ అక్కర లేదు. నీవు మంచి కీర్తివంతుడు కావాలి. ఫలాని తల్లి కుమారుడని పేరు సంపాయించాలి. సత్యధర్మ పరాయణుడు కావాలి. త్యాగశీలుడు కావాలి. దేశోపకారి కావాలి. ఇది నేను ఆశించే ఆశ' అన్నది. కానీ, దానితో ఆ కుమారుడు సంతృప్తి పొందలేదు. మరికొంత కాలమైన తరువాత, 'అమ్మా! నగలు కావాలా? దుస్తులు కావాలా? నీ కోరిక చెప్ప'మని అడిగాడు. అప్పుడు తల్లి చెప్పింది, ' నాయనా! ఇప్పుడు నేను విలువైన దుస్తులను, నగలను ధరించే వయస్సు కాదు. ఐతే, నాకు మూడు నగలు కావాలి. ఇంకా కొంత కాలమైన తర్వాత కోరతాను' అంది. కొంత కాలమైన తర్వాత యింకా కొంత ధనము సంపాయించుకున్నాడు. చక్కగా వినయవిధేయతలతో తల్లి దగ్గరకు వచ్చాడు. 'అమ్మా! నీ మూడు కోరికలు చెప్ప'మన్నాడు. 'నాయనా! మొదటి కోరిక చెబుతాను. మన గ్రామము చాలా కుగ్రామము. ఈ గ్రామము లోపల విద్యాసదుపాయములు లేవు. ప్రైమరీ స్కూలు కూడా లేదు. ఆ చిన్నచిన్న పిల్లలు ప్రక్క గ్రామాలకు వెడుతుంటే ఎండను సహించుకోలేక, వర్షములో తడిసి అనేక రోగములకు గురైపోతున్నారు. మన గ్రామంలో ఉన్న చిన్న పిల్లలకు ప్రైమరీ స్కూలు కట్టించు. అదే నా మొట్టమొదటి కోరిక' అనింది. 'రెండవది, ఈ పిల్లలకు దగ్గు వచ్చినా, జలుబు వచ్చినా, ఏది వచ్చినా ప్రక్క గ్రామమునకు వెళ్లి చాలా బాధలు పడుతున్నారు. ఈ దుఃఖము నేను చూడలేకుండా ఉన్నాను. ఒక చిన్న ఆసుపత్రి కట్టించు' అంది. ఇంక మూడవ కోరిక ఏమిటని అడిగాడు. 'నీ చదువు అమ్ముకోవద్దు. నీ చదువు వల్ల గర్వము యేమాత్రమూ చేర్చుకోవద్దు. వినయవిధేయతలు నీ ప్రాణము పోయేంత వరకు పోషించుకో. అందరికీ సేవకుడుగా తయారుకావాలి. సేవకత్వమునందే ఉంటున్నాది నాయకత్వము. నీవు వినయవిధేయతలతో జీవించాలి. ఈ మూడే నా నగలు' అంది. తల్లి ఆజ్ఞను శిరసావహించి ఆ చిన్న పల్లెలో ఒక చిన్న ప్రైమరీ స్కూలు కట్టించాడు. చిన్న ఆసుపత్రి కట్టించాడు. తన జీవితమంతా చక్కని సేవతో సత్కీర్తిని సంపాయించాడు. అతడే ఈశ్వరచంద్ర విద్యాసాగర్. అతడు గొప్ప పండితుడు. విద్యలేని వారు, ఆడవారు, మగవారు అందరినీ ఆకర్షించే ఉపన్యాసములుతనివి. ఎలాంటి ఉపన్యాసములు? సమాజానికి ఉపయోగమయ్యే ఉపన్యాసములు. ప్రజలకు చక్కని బుద్ధిని బోధించే ఉపన్యాసములు. దోషములకు యేమాత్రమూ అవకాశము అందించ కూడదని బోధించే ఉపన్యాసములు. ఈవిధమైన ఉపన్యాసములు ఒక గ్రామమందు వినాలని ఒక గొప్ప అధికారి చిన్న సూట్‌కేసు తీసుకున్నాడు. రైల్లో వచ్చాడు. ఆ గ్రామములోనే విద్యాసాగర్ ఉపన్యాసము. విద్యాసాగర్ ఉపన్యాసమని పెద్ద బోర్డు వేశారు. రైలు దిగి ఈ అధికారి 'కూలి, కూలి' అని అరుస్తున్నాడు. ఎక్కడా కూలి చిక్కలేదు. ప్రక్కనే ఉంటున్నాడు, అదే రైల్లో దిగాడు విద్యాసాగర్. 'ఎందుకండీ మీరు కూలిని విచారిస్తున్నారు?' 'నా బాక్సు మోయాలి' అన్నాడు. 'క్షమించండి, ఆ బాక్సు నేను మోస్తాను. మీరు ఎక్కడకు వెళ్లాలో అక్కడకు తీసుకు వస్తాను' అన్నాడు. సరే తీసుకున్నాడు. చూస్తే చాలా సింపుల్‌గా ఉన్నాడు ఈశ్వరచంద్రవిద్యాసాగర్. ఇతను ఒక కూలిమనిషి అనుకున్నాడు అధికారి. సరే అక్కడకు పోయి బాక్సు పెట్టాడు. థాంక్సు చెప్పాడు ఈశ్వరచంద్రవిద్యాసాగర్‌కు. పోకెట్‌నుండి రూపాయి తీసి యిచ్చాడు. 'క్షమించండి. నేను సేవ నిమిత్తమై వచ్చిన వాడనేగాని అధికారనిమిత్తమై కాదు'అని థాంక్స్ చెప్పి వెళ్లిపోయాడు. వెళ్లే సమయములో ఒక మాట చెప్పి వెళ్లాడు. 'మీరు చదివిన చదువంతా ప్రయోజనము లేని ఆచరణగా ఉంటున్నాది. గొప్ప విద్యావంతుడవై నీ పని నీవు చేసుకోలేక పోతున్నావు. ఇంత బలహీనుడైపోతున్నావు. చదువుకు వినయమే గొప్ప భూషణము. ఈ

వినయము లేని, అహంకారముతో కూడిన విద్య విద్యయే కాదు. ఈ అహంకార అభిమానములే మానవుని అనంత దుర్గుణములకు కారణము. ఈ గుణములను మీరు మానుకోండి' అని చెప్పి వెళ్లాడు. అందరూ అతను ఉపన్యాసము చేసే వేదిక దగ్గరకు చేరారు. వేదికపైన విద్యాసాగర్‌ను వెల్‌కం చేయటానికి కాచుకొని ఉంటున్నారు. వేదికపైకి వచ్చాడు. అందరూ అతనికి మాలలు వేసి సత్కరిస్తున్నారు. ఈ అధికారి ఆడియన్సులో కూర్చున్నాడు. చూచాడు. ఇతనేనా విద్యాసాగర్. తన బాక్సు మోసుకు వచ్చినవాడు ఇతనేనా! ఛీ! ఛీ! నేనెంత తప్పు చేశాను. మనిషి విలువను నేను గుర్తించుకొనలేక అహంకార అభిమానముచేత గొప్పవానిని నేను అగౌరవించాను. మంచివారికి వినయమే సాక్షి. నిజమైన విద్యావంతునకు వినయమే భూషణము. ఈనాడు ఈ గుణము నేర్చుకున్నానని తనలో తాను భావించాడు. ఈశ్వరచంద్రవిద్యాసాగర్ గొప్ప విద్యావంతుడైనప్పటికీ తనలో దోషసంకల్పము ప్రారంభమైతే తాను దానిని చక్కగా విమర్శించి తగిన గుణపాఠం నేర్పేవాడు. 'ఛ! ఇలాంటి దుర్భావములు రావటానికి నేను మనిషినా లేక పశువునా? నేను పశువు కాదు, రాక్షసుడను కాను, నేను మానవుడను. మానవునిలో యిలాంటి గుణము రాకూడదు' అని ఆవిధమైన కఠిన శిక్ష దానికందించి తాను సరైన మార్గములో ప్రవేశించేవాడు.

కానీ, ఈనాటి విద్యావంతులు, విద్యార్థులు దురదృష్టవశాత్తు తప్పు పనులు చేస్తారు. దోషమయమైన సంకల్పాలు సలుపుతారు. కాని, సమర్థించుకుంటారు. ఏమని? నేను మానవమాత్రుడను, ఈ సంకల్పాలు వస్తుంటాయి. అది సహజమే కదా అంటారు. ఇదే పెద్ద బలహీనత. మానవమాత్రునకు దుస్సంకల్పములు రానేకూడదు. దుర్మార్గములో ప్రవేశించకూడదు. దుష్ప్రవర్తనలో చేరనే కూడదు. అదే నిజమాన మానవుడు. ఈనాడు దానిని సమర్థించుకుంటూ రావటం చేత రాక్షసులుగా మారిపోతున్నారు. దోషాన్ని తాను సమర్థించుకోకూడదు. మానవుడు కదా యిది సహజమని భావించకూడదు. మానవునకు ఇది సహజమే కాదు. మానవునికి సద్గుణములు, సదాచారములు సహజలక్షణములు. ఇలాంటి సద్భావములను పోషించుకోటానికి తగిన కృషి చేయాలి. ఈనాడు మానవుని ఆకారము, మృగముయొక్క ఆచరణ. మానవుని ఆకారము రాక్షసునియొక్క ప్రవర్తన. 'రూపు చూసి మోసపోకు, గుణమే నీ నిజ రూపము' అన్నారు. గుణమే మానవుని యొక్క నిజరూపము. చేతులు, కాళ్లు, ముక్కు, తల ఉన్న ఈ ఆకారము చూసి మోసపోకూడదు. ఇలాంటి సద్భావములను దేశమునకు చక్కగా చాటి అనేకరకములైన ఆదర్శములందించిన మహనీయులు ఎంతమందో జగత్తులో ఉద్భవిస్తూ వచ్చారు.

కాని, ఈనాడు యిలాంటి మహాతల్లులు అరుదైపోతున్నారు. కుమారుడు చేసే దోషములను ప్రోత్సహిస్తున్నారేగాని తల్లిదండ్రులు ఖండించటం లేదు. కనుక, ఈనాటి విద్యావంతులు యింత అజ్ఞానములో మునగటానికి తల్లిదండ్రులే మూల కారణము. తల్లిదండ్రులకు సంస్కారముంటేకదా పిల్లలకు అందిస్తారు. కుమారుడు చెడ్డవాడయ్యాడంటే దానికి నిజముగా తల్లిదండ్రులు చెడ్డవారు. వారు చెడ్డవారు కాకపోతే చెడ్డపిల్లలు పుట్టటానికి వీలుకాదు. మామిడి చెట్టుకు వేపకాయలు కాస్తాయా! తల్లిదండ్రులలో దోషమే పిల్లలలో ప్రవేశించింది.

రంగూన్ యుద్ధము జరిగిన తర్వాత, రంగూన్ నుండి కొంతమంది భారతీయులు భారత దేశములో ప్రవేశించారు. మద్రాసుకు ఒక తల్లి, కుమారుడు చేరారు. భర్త, మిగిలిన సోదరులు ఎక్కడకుపోయారో, ఒకరికొకరికి సంబంధము లేదు. వారికి ఏ ఆధారము లేదు. కొంతకాలము యింటయింట భిక్షమెత్తి తీసుకువచ్చి కుమారునకు పెట్టి తదుపరి మిగులుతే తాను భుజించేది. లేకపోతే పస్తుండేది. ఈ పరిస్థితి పిల్లవాడు చక్కగా గుర్తించాడు. చిన్నపిల్లవాడే. 'అమ్మా! నీవు తినకుండా నాకు పెడుతున్నావే తెచ్చిన బిక్షలో నీవు అర్థము నేను అర్థము తిందాం' అని ఎంతో ప్రాధేయపడ్డాడు. కాని, పవిత్రమైన మాతృమూర్తి హృదయము అంత సున్నితమైనది. నా కుమారుడు ముందు తినాలి, బాగా బ్రతకాలి అనే సదుద్దేశ్యముతో యీవిధంగా చేస్తూ వచ్చింది. క్రమముగా తల్లి బిక్షము తీసుకురావటానికి శక్తి లేకపోయింది. తల్లి పాదములు పట్టుకొని, 'అమ్మా! నీవు ఈ చెట్టు క్రిందే వుండు. నేను బిక్షమెత్తుతాను' అన్నాడు. కుమారుడు బిక్షమునకు పోతుంటే తల్లి భరించుకోలేక కంటిధారలు కార్చింది. తల్లి బ్రతికే కుమారుని బిక్షగానిని చేయటమా! విధిలేదు. నేను నడవలేను. చేయక తప్పదు అని ఒప్పుకుంది. కుమారుడు ఇంటింటికీ పోవటం యింత బిక్షము తేవటం. అమ్మకు పెట్టటం, తాను పస్తుండటం. 'నాయనా! నీవు తిన్నావా?' అని అడిగితే, 'నేను తిన్నానమ్మా' అని ఏదోఒక సాకు చెప్పితల్లిని మాత్రం భుజింపచేసేవాడు. ఈవిధంగా తల్లికి పెడుతూ తాను పస్తువుంటూవచ్చాడు. కొన్ని దినముల తరువాత బిక్షము ఎక్కడా చిక్కలేదు. తల్లి బలహీనమైపోయింది అన్నము లేక. ఒక ఇంటి దగ్గరకు వెళ్ళాడు, 'ఆకలి, ఆకలి' అన్నాడు. వరండాలో ఛైర్‌లో పేపరు చూస్తున్నాడు యజమాని. 'ఏయ్! నీకు ఆకలౌతుందా?' అడిగాడు. 'అవును సార్' అన్నాడు. 'అయితే యిక్కడ కూర్చో, ఆకు వేసి అన్నము వడ్డిస్తాను, భుజించు' అన్నాడు ఆ పిల్లవాడు. 'నేను భుజించను. నా జోలిలో అన్నం వేయండి. ఇంటికి తీసుకువెడతాను' అన్నాడు. 'ఆకలౌతే నీవు భుజించాలిగాని యింటికి ఎందుకు తీసుకుపోతావు' అడిగాడు. లోపలి రహస్యము చెప్పలేదు. 'ఇక్కడ తినను, ఇంటికి తీసుకువెడతాను' అనుకుంటూ క్రింద కూలిపోయాడు పిల్లవాడు. ఏదో నోటితో పలుకుతున్నాడు పదములు. ఈ ఆఫీసరు దగ్గరకు వెళ్లి చెవి పెట్టి విన్నాడు. ఏమంటున్నాడు ఆ పిల్లవాడు, 'మొదలు అమ్మకు తరువాత నాకు. మొదట అమ్మకు తరువాత నాకు' అంటూ ప్రాణం విడిచాడు. చూచారా! ఆ తల్లీబిడ్డల ప్రేమబంధము. తల్లి నిమిత్తమై కుమారుడు ప్రాణములిచ్చేవాడు. కుమారుని

నిమిత్తమై తల్లి ప్రాణములందించేది. తల్లి కుమారులసంబంధము గొప్ప అనుబంధముగా మారిపోయింది. దీనికి కారణము పూర్వజన్మ సంస్కారమే. కాని, ఈనాడు ఆధునిక చదువులు అభివృద్ధికావటంచేత తల్లి ప్రేమ కూలిపోయింది. తండ్రి ప్రేమ మాడిపోయింది. కుమారునియొక్క సంబంధమే కూలిపోయింది. చదువు చేసే దుర్మార్గమునకు వేరే సాక్ష్యమే లేదు. పెద్దలంటే గౌరవమే లేదు. తల్లిదండ్రులంటే విశ్వసమే పోయింది. స్వార్థము దిగజారిపోయింది. స్వార్థము, స్వప్రయోజనము జీవితముయొక్క ఆధారమౌపోయింధి. అపకీర్తులు తెచ్చిన కుమారుడు బ్రతికి ప్రయోజనం ఏమిటి? ఇలాంటి కుమారులు ఈనాడు అభివృద్ధి కావటంచేత దేశము యిన్నివిధములైన దురవస్థలకు గురైపోయింది. పూర్వకాలము దేశసంరక్షణ నిమిత్తమై, తన క్షేమనిమిత్తమై, తోటి మానవుల సహాయ నిమిత్తమై తాను నడుము కట్టి సమాజములో దూరేవాడు. ఈనాడు కంటితో అవస్థలు చూస్తున్నప్పటికీ కాలు ముందుకు వేయలేకపోతున్నాడు. స్వార్థమే తాను ఆధారంగా తీసుకుంటున్నాడు. ఈవిధమైన దుర్గుణాలకు చావుచదువులే మూలకారణము. ఏమి చదువులు, అంతా చెత్తచదువులు. కేవలము పొట్టకూటి నిమిత్తమై చదివే చదువులే. గౌరవమర్యాదలు మంటగలసిపోతున్నాయి. మనము చదివిన చదువును సమాజములో వినియోగించాలి. మంచి పేరును సాధించాలి. అలాంటి వారు కావటానికి తల్లదండ్రులుకూడా గొప్ప సంస్కారవంతులు కావాలి. తల్లిదండ్రులలోనే సంస్కారము లేనప్పుడు పిల్లలలో ఏవిధంగా వస్తుంది? ట్యాంకులో నీరుంటేగదా ట్యాప్‌లో వస్తుంధి. దీనికి మూలకారణం తల్లిదండ్రులే. తల్లిదండ్రులు కుమారుడు చేసే చెడ్డ యేమాత్రమూ సహించకూడదు. చక్కని బుద్ధి చేప్పాలి. వారికి తగిన ఆదర్శమునందించాలి. ఇది నిజమైన విద్యయొక్క వివేకము.

'విద్య యొసగును వినయంబు, వినయము వలన కలుగు పాత్రత'. దాని వలనే మోక్షము. కాని, ఈనాడు తల్లిదండ్రుల ఆజ్ఞ అంటే ఏమాత్రమూ తాను శిరసావహించటం లేదు. ఈనాడు ఈ పరిస్థితిలో వుంటున్నావు. రేపు నీవు వృద్ధుడౌతే నీ కుమారుడు నీ మాటలు వింటాడా? కాదు, కాదు. మొట్టమొదట నీ తల్లిదండ్రులను గౌరవించాలి. తల్లిదండ్రులుకూడా కుమారునికి సరైన మార్గము చూపించాలి. అలాంటి రెండూ లేని పరిస్థితిలోపల ఈనాడు జీవితము జరిగిపోతూ వున్నది. మన దేశము భారతదేశము. త్యాగములో రాగము, రాగములో త్యాగము,దీనిని అభివృద్ధి చేసుకోవాలి. భోగమంటే దూరము కావాలి. త్యాగమంటే సమీపించాలి. ఈనాడు త్యాగములో భోగము, భోగములో రోగము. జీవితమంతా రోగమయంగా మారిపోతుంది. ఇదికాదు మనయొక్క జీవితము. విద్యార్థులు, నిజముగా విద్యావంతులైనవారు ఆదర్శప్రాయంగా నిలవాలి. ఆదర్శప్రాయులుగా నిలుస్తున్నారు, దేనిలో? దుర్గుణములలో ఆదర్శప్రాయులుగా నిలుస్తున్నారు, దురాచారములలో ఆదర్శప్రాయులుగా నిలుస్తున్నారు, దుష్ప్రవర్తనలో ఆదర్శప్రాయులుగా వుంటున్నారు. సాచారము, సత్యసంపత్తి, సంస్కారము ఈనాడు పూర్తీ సన్నగిల్లిపోయింధి. ఆనాటి మహనీయులందరూ స్వార్థము పూర్తీ త్యాగము చేసి సమాజము కోసం జీవితమును అర్పితం చేశారు.

మన భారతదేశమునకు స్వాతంత్ర్యము వచ్చిన తక్షణమే వల్లభాయ పటేల్ డిప్యూటీ ప్రైమినిష్టరుగా వున్నాడు. అప్పుడు ఈ సుశీలానయ్యర్ హెల్త్ మినిష్టరుగా వుండేది. అప్పుడే నన్ను వారింట్లో చూచింది ఢిల్లీలో. తదుపరి యిక్కడికి 1962లో వినోభాభావే జతలో పుట్టపర్తి వచ్చింది. అప్పటినుండి స్వామి అనుబంధము ఆమెలో ఎంతో చేరివుంది. వల్లభాయిపటేల్ అనేవాడు, 'సుశీలమ్మా! నీవు సింపుల్‌గా వుంటున్నావు. నీవు మినిష్టరుగా వున్నందువల్ల కొంచెం ఆదర్శము చూపించాలి'. తమాషాకు ఈమెను గేలిచేసేవాడు. వల్లభాయిపటేల్‌కు బిడ్డ వుండేది. ఆ బిడ్డ ఆదర్శవంతమైన బిడ్డ. ఆమె చేతులారా వడికి తండ్రికి పంచెలు నేసి, పాత పంచలు రెండు చేర్చి ఒక చీరగా తాను ధరించేది. ఆనాటి రాజకీయ నాయకులంతా ఆదర్శప్రాయులుగా వచ్చారు. రాజకీయ నాయకులు అటువంటి పవిత్రమైన చిత్తములు కలిగినవారు కనుకనే దేశమును హస్తములో తెచ్చుకుంటూ వచ్చారు. స్వాతంత్ర్యముకోసం పాటుపడుతూ వచ్చారు. ఆనాడు తెల్లటివారు నల్లవారిని కొడుతున్నారని బాధపడేవారు. దురదృష్టవశాత్తు ఈనాడు నల్లవారు నల్లవారినే కొడుతున్నారు. దేశము కోసము సర్వమూ త్యాగముచేసి సమాజములో దూకినవారున్నారు. ఈనాడు స్వార్థము కేసమని దేశమును పాడుచేసేవారు బయలుదేరుతున్నారు. ఇది కాదు నాయకత్వము, ఇది కాదు ఆదర్శము. ఇది కాదు విద్య. నిజమైన మానసిక సంబంధమైన ఆనందమును మనం అభివృద్ధి పరచుకోవాలి. దివ్యమైన దైవచింతన ప్రతిష్ట చేసుకోవాలి. అప్పుడే మనలో త్యాగము ఆవిర్భవిస్తుంది. అలాంటి త్యాగము కలిగినప్పుడే మనము మానవులము అని అనిపించుకోటానికి ఒక అర్హతవస్తుంది. త్యాగము లేక మానవులము ఎట్లా అవుతాము? అందుకోసమే వేదమునందు, 'న ప్రజయా త్యాగేనైకే అమృతత్వ మానసుః' అమృతత్వం ప్రాప్తించాలంటే త్యాగము కావాలి. ఈనాడు ఏ అమృతం కావాలి వీరికి? లిక్కరు కావాలి. అదే అమృతము. సమాధిలో వుంటారు. ఛీ! ఇదా చదువుకున్నందుకు సరైన లక్షణము. ఇది చదువుకు అవలక్షణము. చదువుకున్నవాడు మంచి సంస్కారముతో వుంటుండాలి. అరికటాటలి. ఎదుర్కొనాలి. life is a challange, meet it. మనము కష్టములను ఎదుర్కోవాలి. సమాజమునకు సుఖమునందించాలి. ఫలానివాడు మంచి పిల్లవాడని పేరు తీసుకొని రావాలి. ఫలాని తల్లిదండ్రులకు పుట్టిన పిల్లవాడు చాలా గుణవంతుడని తల్లిదండ్రులకు కీర్తి తెప్పించాలి. ఈనాడు తల్లిదండ్రులకు కీర్తి లేదు, తనకు కీర్తి లేదు, దేశానికి కీర్తి లేదు, తన ఇన్‌స్టిట్యూట్‌కి కీర్తి లేదు. ఎందుకిలాంటి కీర్తి లేని బ్రతుకు? ఎవరిని వారు సమర్థించుకుంటున్నారు. సామాన్యమైన మానవులము కాదా, మా కీభావములు సహజం. వీని కంటే పంది మేలు. ఈవిధంగా సమర్థించుకుంటారా? మానవుడై పుట్టినవాడు సమర్థించుకోటం సరైన

లక్షణం కాదు. ఛ! నేను మానవుడను, నాకు ఇలాంటి గుణములు రాకూడదు. నేను కేవలం మృగసబంధమైన వాడిని అని మృగముపైన తాను పోటీపడాలి. ఇలాంటి ఛాలెంజ్ చేసే చదువుల మనం ఈనాడు చదవాలి.

ఈనాటి పిల్లలందరూ అశాంతంగా కూలిపోతున్న ఈ దేశములో శాంతి ప్రచారము సల్పే దూతగా తయారు కావాలి. అంతేగాని యమదూతలుగా కాకూడదు. అవధూతలు కండి. అవధూతలైతే జగత్తు బాగుపడుతుందిగాని, యమదూతలైతే అందరినీ హింసిస్తారు. మన పవిత్రమైన విద్యకు గౌరవమునందించాలి. మనం వున్న సా&థనానికి గౌరవం తెప్పించుకోవాలి. మన డ్యూటీ మనం సక్రమంగా చెయ్యాలి. అదే నిన్న చెప్పాను ఆడపిల్లలు వుననప్పుడు. గవర్నరుకు గవర్నరును బాడీగార్డ్స్ వుంటారు. ఎందుకోసం వుంటారు? గవర్నరును సంరక్షించేకోసమని. ఇక్కడ గవర్నరు అనేవాడు డివోషన్. డివోషన్‌కు ఒకవైపున డ్యూటీ, మరొకవైపున డిసిప్లిన్, ఇద్దరు సంరక్షకులుగా వుండినప్పుడే డివోషన్ అభివృద్ధి అవుతుంది. చక్కగా సుక్షేమంగా వుంటుంది. కాని, ఈనాడు డివోషనే లేదు. ఇక ఎందుకు డ్యూటీ, డిసిప్లిన్? గవర్నరు లేనప్పుడు ఎందుకు ADC లు? భూమికి బరువు. ఈనాడు మనము చేయవలసినది మన డివోషన్ను ప్రొటెక్ట్ చేసుకోవాలి. ఇప్పుడు డివోషన్ అంతా ఓషన్‌గా మారిపోయింది. ఏమిటి ఆ ఓషన్? అదే సంసార సాగరము. అదే సాగరము. సాగరము లోపల తిమింగలాలు, షార్క్‌లు వుంటుంటాయి. ఎన్నోరకములైన కౄరమృగములుంటాయి. మనము ఈ సాగరములో పడకూడదు. క్షీరసాగరములో పడాలి. ఇదంతా క్షారసాగరము. ఉప్పునీరిది. సాని, భగవంతుని ఆనందమనే క్షీరసాగరములో మనము మునగాలి. అదియే నిజమైన చదువు. ఇలాంటి చదువును సద్వినియోగపరచి సరైన ఆదర్శము నిరూపిస్తారని నేను ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.